క్లుప్తంగా

వదలని ముసురు



దహెగాంలో కమ్ముకున్న మబ్బులు

దహెగాం: గత వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం బయటకు వెళ్లాలేని పరిస్థితి. విద్యార్థులు వర్షంలో బడికి వెళ్లాలేకపోతున్నారు. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, ప్రాజెక్టులు, కుంటలు నిండుకుండాల మారాయి. అత్యవసరం ఉంటే తప్ప ప్రజలు బయటకు రావడం లేదు. ఇంకా ఎన్ని రోజులు ముసురు ఉంటుందోనని ప్రజలు చీదరించుకుంటున్నారు.

కల్వర్టుపై ఉన్న చెత్త తొలగింపు



చెత్తను తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఎస్సై

కెరమెరి: మండలంలోని సాంగ్వి, రాంపూర్ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న కల్వర్టుపై ఉన్న చెత్తను గురువారం తొలిగించినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. కల్వర్టుకు అడ్డుకుని ఉన్న కర్రలు, చెత్తాచెదారం రోడ్డుపైకి చేరిందన్నారు. వాటిని జేసీబీతో తొలగించామన్నారు.

వ్యవసాయ బావులకు కొలతలు



బావి కొలతలు తీస్తున్న అధికారులు

కెరమెరి: మండలంలోని పరంధోళి గ్రామంలో ఉపాధిహామీ పథకంలో వ్యవసాయ అనుబంధ బావులకు గురువారం ఈజీఎస్ అధికారులు కొలతలు తీసుకున్నారు. ఒక్కో బావికి నిధులు రూ. 4 లక్షలు ఉంటుందని ఈజీఎస్ ఏపీవో మల్లయ్య తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బావిలోని నీటితో కూరగాయలు పండించడంతో పాటు తాగునీటికి ఉపయోగించవచ్చని ఈసీ ఐక్యానాయక్, టీఏ మహేందర్ తెలిపారు.

ఘనంగా సాంస్కృతిక దినోత్సవం



పాటలు పాడుతున్న విద్యార్థులు

కెరమెరి: జాతీయ విద్యా దినోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని ఆయా పాఠశాలల్లో గురువారం సాంస్కృతిక దినోత్సవాన్ని నిర్వహించారు. భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులతో పాటలు పాడించి, నృత్యం చేయించారు. జాతీయ విద్యా దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చంద్రశేఖర్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా పెన్‌గంగ



పెన్‌గంగ ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్సై

సిర్పూర్(టి): మండలంతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెన్‌గంగ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు సూచిస్తున్నారు. గురువారం మండలంలోని వెంకట్రావ్‌పేట్‌- పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిలోని వంతెన వద్ద పెన్‌గంగ నది ఉధృతిని సిర్పూర్(టి) ఎస్సై రమేశ్ పరిశీలించారు. వాగులు, ఒర్రెల వద్దకు చేపల వేట కు వెళ్లవద్దని సూచించారు. అత్యవసర సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కూలిన ఇల్లు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం అనుకోడ గ్రామానికి చెందిన మైలారపు అంజయ్య అనే వ్యక్తి ఇల్లు గురువారం కూలిపోయింది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షానికి తడిసి కూలింది. కూలీ పని చేసుకుని జీవనం కొనసాగించే అంజయ్య ఇల్లు కూలిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. కుటుంబీకులు ఆరుబయట ఉన్న సమయంలో కూలిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

గుప్పుమంటున్న గుడుంబా

- గ్రామాల్లో విచ్చలవిడిగా విక్రయాలు
- మత్తుకు బానిసవుతున్న యువత
- పచ్చని కుటుంబాల్లో చిచ్చు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

బెజ్జూర్(సిర్పూర్): జిల్లా వ్యాప్తంగా గుడుంబా గుప్పుమంటోంది. వాగులు, వంకల పరిసర ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలు కుటీర పరిశ్రమలుగా కొనసాగుతున్నాయి. సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఈ విషయం తెలిసినా కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుటుంబాల్లో చిచ్చురేపుతున్న 'మత్తు' నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతునా.. అధికారుల నిర్లక్ష్యంతో సరైన ఫలితం ఉండడం లేదు.

విచ్చలవిడిగా విక్రయాలు..

సిర్పూర్ నియోజకవర్గం పరిధిలోని ఏడు మండలాలైనా సిర్పూర్(టి), కాగజ్‌నగర్, చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాంలో గుడుంబా విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. మండల కేంద్రాల్లోనే అమ్మకాలు సాగుతున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. చిన్నపాటి కిరాణాల్లో కూడా గుడుంబా దొరుకుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- కాగజ్‌నగర్ మండల కేంద్రంతోపాటు చింతగూడ, ఈజ్‌గాం, వేంపల్లి, రాస్పెల్లి, అందవెల్లి, భట్టుపల్లి సిర్పూర్(టి) మండల కేంద్రంతోపాటు లోనవెల్లి, పెద్దబండ, చింతకుంట గ్రామాల్లో విచ్చలవిడిగా గుడుంబా తయారుచేసి విక్రయాలు జరుపుతున్నారు.
- కౌటాల మండల కేంద్రం, ముత్తంపేట్, గురుడుపేట్, బోదంపల్లి, చింతలమానెపల్లి, లంబడిగూడ, ఏటిగూడ గ్రామాల్లో తయారు చేసి రవీంద్రనగర్, మానెపల్లి, కర్జవెల్లి, బాబాపూర్, కోర్సిని, గంగాపూర్ తదితర గ్రామాలకు ద్విచక్ర వాహనాల ద్వారా తరలిస్తున్నారు.



రాస్పల్లి గ్రామ శివారులో తయారుచేస్తున్న గుడుంబా

- బెజ్జూర్ మండలంలో లంబాడిగూడ గ్రామంలో గుడుంబాస్థావరాలు ఏర్పాటు చేసి సమీపంలోని ఎలుకపల్లి, సిద్దాపూర్, కుకూడ, పోతెపల్లి, బారెగూడ, కృష్ణపల్లి తదితర గ్రామాల్లో అమ్మకాలు సాగిస్తున్నారు.
- పెంచికల్‌పేట్ మండలంలో లోడపల్లి, కొండపల్లి, దహెగాం మండల కేంద్రంతోపాటు కుంచవెల్లి, కలవాడ తదితర గ్రామాల్లో విక్రయాలు ఎక్కువగా ఉన్నాయి.

ఊరూరా తిరుగుతూ విక్రయాలు..

గుడుంబా తయారీదారులు కాలినడకతోపాటు ద్విచక్ర వాహనాలపై వచ్చి అమ్మకందారులకు హోల్‌సేల్‌గా అప్పగించి వెళ్తున్నారు. అనంతరం చిల్లర వర్తకులు కొంతమంది ఊరూరా తిరుగుతూ ప్లాస్టిక్ కవర్లలో గుడుంబాను అమ్ముతున్నారు. తయారీదారులు, అమ్మకందారుల నుంచి ఆబ్కారీ అధికారులు, సిబ్బందికి నెలనెలా మామూళ్లు అందడంతోనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న గుడుంబా రక్కసిపై ఉక్కు పాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

సమాచారం అందించాలి

గుడుంబా తయారీ చేసినా.. విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదు చేస్తాం. గ్రామాల్లో ఎక్కడైన గుడుంబా తయారీ, విక్రయాలు జరిగితే 8712658784 నంబర్‌లో సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– రవి, ఎక్సైజ్ సీఐ, కాగజ్‌నగర్

రోడ్డుపై గుంతల పరిశీలన

జైనూర్: ఆరు నెలల క్రితం రూ. 1కోటి వ్యయంతో మరమ్మతులు చేపట్టిన రహదారిపై గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడు అన్నారు. గురువారం మండలంలోని పవర్‌గూడ శివారులోని వంతెన వద్ద ఏర్పడిన గుంతలను పరిశీలించారు. కెరిమెరి నుంచి జైనూర్ మండల కేంద్రం వరకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ. 15 కోట్లు మంజూరు చేసినా.. అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మరమ్మతు చేయలేదన్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని కోరారు.



గుంతలను పరిశీలిస్తున్న ఆంజనేయులు గౌడ్

మహాసభ విజయవంతం చేయండి

ఆసిఫాబాద్: మండల్‌డే సందర్భంగా పంజాబ్ రాష్ట్రంలోని అమృతసర్ గురునానక్ యూనివర్సిటీది గోల్డెన్ కన్వెన్షన్ హాల్‌లో ఆగస్టు 7న నిర్వహించే జాతీయ ఓబీసీ 9వ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు మహాసభలో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పురుషోత్తం బలేశ్, గాజుల జక్కయ్య, మారుతి, రాధిక పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలి

ఆసిఫాబాద్‌రూరల్: బీసీ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర ప్రీ మెట్రిక్ వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ శిథిలావస్థకు చేరుకుందని, గత ఏడాది పైకప్పుకి మరమ్మతులు చేసినా.. ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి కృష్ణ, సమన్న, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభించేదెప్పుడో?



నిరుపయోగంగా భవనం

- 17 ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని వైనం
- రెండేళ్ల కిత్రం 90 శాతం పనులు పూర్తి

తిర్యాణి: ఆదివాసీలకు అందుబాటులో మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో మండలంలోని అత్యంత మూరుమూల గ్రామమైన గుండాలలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం కోసం 2007లో ఐటీడీఏ ద్వారా రాష్ట్రీయ స్వయం వికాసయోజన కింద రూ. 7 లక్షల మంజూరు చేశారు. అయితే ఇక్కడికి నిర్మాణ సామగ్రి తరలింపులో ఇబ్బందులు ఏర్పడడంతో బేస్‌మెంట్ దశలోనే నిర్మాణ పనులను అప్పటి కాంట్రాక్టర్ నిలిచివేశాడు. దీంతో గుండాల గ్రామంలో ఎలాగైనా సబ్ సెంటర్ భవనంను పూర్తి చేయాలనే ఉద్దేశంతో మళ్లీ గోడల నిర్మాణం చేపట్టారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. కానీ ఇప్పటికీ భవనాన్ని ప్రారంభించలేదు. మూరుమూల గ్రామాల్లో సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున పెండింగ్ పనులె త్వరగా పూర్తి చేసి సబ్‌సెంటర్‌ను అందుబాటులోకి తీసుకోని రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తరగతులు ప్రారంభం

కాగజ్‌నగర్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2023- 24లో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీలో అడ్మిషన్ తీసుకున్న మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 28, ఆగస్టు 8, 11, 18 తేదీల్లో కాంట్రాక్టు కం కౌన్సెలింగ్ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. తరగతులకు విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

నేడు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

కాగజ్‌నగర్ రూరల్: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు మాజీ ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశ్రాంత సైనిక సిబ్బందికి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ర్యాలీ లో పాల్గొని కార్గిల్ విజయ్ దివస్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీనియర్ సిటీజన్స్ కార్యాలయంలో..

కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవా రం పట్టణంలోని సీనియర్ సిటీజన్ కార్యాలయంలో అమర సైనికులకు నివాళుల ర్పించడం జరుగుతుందని సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారా యణ తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించేకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ముత్నూర్ గ్రామ సమీపంలోని త్రివేణి సంఘం చెరువు, ఏమాయికుంట గురుదేవ్ చెరువులను పరిశీలించారు. అలాగే చిత్తబట్ట, జైత్రంతండా గ్రామాలను సందర్శించారు. ఎలాంటి సమస్య ఉన్నా.. అధికారులకు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది వెట్టి అచ్‌పత్‌రావ్, కోడప నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజ లు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని గాంధారి, గాజిలి గ్రామాల వాగులను పరిశీలించారు. వాగు ప్రవాహం ఉధృతంగా ఉన్నందున వాగులు దాటవద్దన్నారు. అనంతరం గ్రామాల్లో పర్యటించారు. ప రిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

రెబ్బెన: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని స్నేహ కల్చరల్ ఆర్ట్స్ అండ్ సేవా సంస్థ అధ్యక్షుడు గోపాలకృష్ణ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల ఆవరణలో, గోలేటి పరిసరాల్లోని అటవీప్రాంతంలో హరిత నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవీ ప్రాంతంలో నివసించే జీవరాశి మనుగడకు మొక్కలు ఎంతో కీలకమన్నారు. అభివృద్ధి పేరుతో అడవిని నాశనం చేయడం సరికాదన్నారు. అటవీ ప్రాంతం వృద్ధి చెందితేనే జీవరాశులకు ఆహారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సింగరేణి పాఠశాల హెచ్‌ఎం సంతోష్, పీఈటీ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న గోపాలకృష్ణ, హెచ్‌ఎం సంతోష్

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

రెబ్బెన: సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గంగాపూర్ కేజీబీవీ వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరంగల్ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు దేవేందర్, రాజేష్, సత్యనారాయణ, మహేశ్వర్, సీసీవో భాగ్యలక్ష్మి, ఎస్‌వో పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

ఏరియాలో సేఫ్టీ జీఎం పర్యటన

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో గురువారం సేఫ్టీ జీఎం (కార్పొరేట్) గురువయ్య పర్యటించారు. ఈసందర్భంగా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సేఫ్టీ జీఎంకు ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు స్వాగతం పలికారు. ఈనెలాఖరుతో పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా సేఫ్టీ జీఎంను ఏరియా జీఎం, విభాగాల అధికారులతో కలిసి శాలువాతో సన్మానించి మొక్క అందచేశారు. ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత 42 ఏళ్ల సర్వీసు కాలంలో సింగరేణిలో వచ్చిన సాంకేతికత, రక్షణపై తీసుకున్న చర్యలు, ఉద్యోగుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను ఏరియా అధికారులకు వివరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఎస్‌వోటూజీఎం నరేందర్, ప్రాజెక్టు అధికారులు సత్యనారాయణ, ఉమాకాంత్ పాల్గొన్నారు.



మొక్కను అందజేస్తున్న ఏరియా జీఎం రవిప్రసాద్

ఉపాధిహామీ ప్రజావేదిక



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం డీఆర్‌డీవో సురేందర్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా సిర్పూర్(టి) గ్రామపంచాయతీ కార్యాలయ పరిధిలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జరిగిన పనుల వివరాలు, బిల్లుల చెల్లింపులను వివరించారు. అనంతరం మండలంలోని సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని డీఆర్‌డీవో సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీవో కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్లకు నిధులు మంజూరు చేయాలి

బెజ్జూర్: బీటీరోడ్లకు నిధులు మంజూరు చేయాలని సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అర్షద్ హుస్సేన్, కౌటాల మండల మాజీ ఎంపీపీ వసత్కార్ విశ్వనాథ్‌లు కోరారు. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బీటీరోడ్లకు నిధులు మంజూరు చేసి, రోడ్లు నిర్మించాలన్నారు. బెజ్జూర్ మండలంలోని కొత్తగుడా నుంచి లుంబినగర్ వరకు, పెంచికల్‌పేట నుంచి సలుగుపెల్లి వరకు, చింతలమానేపల్లి నుంచి గూడెం గ్రామం, కౌటాల నుంచి గుండాయిపేట, అలాగే కౌటాల నుంచి తుమ్మిడిహెటి వరకు, సిర్పూర్ నుంచి చిలపెల్లి వరకు బీటీ రోడ్లను మంజూరు చేయాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు.



ఎమ్మెల్సీ దండే విఠల్‌తో మాట్లాడుతున్న నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఎస్సీ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో పని చేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం ఎస్సీ కార్పొరేషన్ డీడీ సజీవన్‌కు ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వసతి గృహాల్లో పని చేస్తున్న వాచ్‌మెన్, ఔట్‌సోరింగ్ వర్కర్లకు ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదని తెలిపారు. అలాగే బీసీ హాస్టళ్లలో పనిచేస్తున్న వారికి తొమ్మిది నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, బ్రహ్మానందం, విలాస్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సమస్యలు అసెంబ్లీలో చర్చించాలి

తాంసి: నూతనంగా ఏర్పడిన భీంపూర్ మండల సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కారించాలని మండల నాయకుడు ప్రవీణ్ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జూనియర్ కాలేజీ, కార్యాలయాలకు సొంత భవనాలు, తదితర సమస్యలను లేవనెత్తి పరిష్కారించేందుకు కృషి చేయాలని కోరారు.

ముర్రా జాతి గేదెలను పెంచుకోవాలి

ఇచ్చోడ: నాణ్యమైన ముర్రా జాతి గేదెలను పెంచుకోవడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా పశువైద్యాధికారి కిషన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు రైతువేదికలో ఇచ్చోడ, బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, సిరికొండ మండలాల గేదెల పెంపకం కోసం ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాల సభ్యులచే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ముర్రాజాతి గేదెలు ఇక్కడి వాతావరణాన్ని తట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ఒక్కగేదె యూనిట్ ధర రూ. 93,270 రూపాయలు అవుతుందన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి కిషన్